ప్రజాశక్తి
సోమవారం 29 సెప్టెంబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు

## గంజాయి సాగు చేపట్టొద్దు

**ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:**మండలంలోనీ అతి మారుమూల ప్రాంత గ్రామ పంచాయతీ లక్ష్మీపురం పరిధిలోని సుత్తిగూడ గ్రామంలో ఎస్పి అమిత్ బర్దర్, డి.ఎస్.పి షేక్ షహబాజ్ అహమ్మద్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆదివాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి సాగు నిర్మూలనకు ప్రభుత్వానికి సహకరించినందుకు రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. గంజాయి రవాణా, క్రయవిక్రయాల జోలికి వెళ్ళవద్దన్నారు. సుత్తిగూడ విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. మహిళలు గ్రామ సమస్యలపై విన్నవించారు. గ్రామంలో తాగునీటి, రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని విన్నవించారు. సమస్యలు పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామనీ హామీ ఇచ్చారు.

మాట్లాడుతున్న ఎస్పి, డిఎస్పి

అరకులోయ సమీపంలోని పానిరంగని వద్ద గోతులమయమైన రహదారి

## గోతుల రోడ్డుతో..
# వాహనదారుల అవస్థలు

రహదారిపై గోతులు

**ప్రజాశక్తి-అరకులోయ:**పర్యాటక కేంద్రమైన అరకులోయ- విశాఖ ప్రధాన రహదారిలో రోడ్లు గోతులమయం కావడంతో వాహన చోదకులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకులోయ మండల కేంద్రం సమీపంలోని పానిరంగిని వద్ద రోడ్డులో పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డును బాగు చేయాలని ఎన్ని మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడు కరువయ్యారని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
గత నెలలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అరకు పర్యటన ఖరారు కావడంతో ఘాట్ రోడ్డులో అక్కడక్కడ అధికారులు గోతులను పూడ్చే చర్యలు తీసుకున్నారు. మరికొన్నిచోట్ల అనంతగిరి జెడ్పిటిసి సభ్యుడు దీసరి గంగరాజు గోతులను పూడ్చారు. దీంతో, వాహన చోదకులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. అరకులోయ సమీపంలోని రోడ్డులో గోతులు పూడ్చిన వారం రోజుల్లోనే మళ్లీ యధాస్థితికి చేరుకుంది. అరకు-విశాఖపట్నం రహదారిలో రోడ్డు పూర్తిగా మరమ్మతు గురవడంతో అనేకమంది పర్యాటకులు, స్థానికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డులోని గోతిలో వర్షపు నీరు నుండి ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిని వెంటనే బాగు చేయాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.
ఒకపక్క కూటమి ప్రభుత్వం గోతులు లేని రోడ్లు నిర్మిస్తామని ప్రకటనలు గుప్పిస్తుందే తప్ప అరకులోయ పర్యాట కేంద్రంలో రహదారుల్లో పరిస్థితి మారలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులమయమైన రహదారిని వెంటనే బాగు చేయాలని కోరుతున్నారు.

## నాలుగేళ్లు గడిచినా..
# ముందుకు సాగని వంతెన పనులు

- వర్షాలతో బురదమయంగా రహదారి మార్గం
- రవాణాకు ఇబ్బంది పడుతున్న గిరిజనులు, పర్యాటకులు

**ప్రజాశక్తి-దుంబ్రిగుడ:**ఆంధ్ర ఒడిశాకు కనెక్టివిటీగా ఉన్న మండలంలోని కొర్రాయి రోడ్డు గత్తర జిల్లెడ వంతెనకు గ్రహణం పట్టుకుంది. సుమారు నాలుగేళ్ళు గడిచినా ఇప్పటికీ నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో, రవాణా సౌకర్యానికి ఆ ప్రాంత గిరిజనులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఆ రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. వాహనాలు వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారు. బురదలో వాహనాలు దిగబడి పోతుండటంతో వాహన దారులు తోసుకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.
ఈ రోడ్డుకు ఆనుకొని కొర్రాయి, కొల్లాపూట్టు, పంచాయతీ గ్రామాలతో పాటు అంతర్ రాష్ట్రం ఒడిస్సాకు రోడ్డు కనెక్ట్ అయి ఉంది. ఈ గ్రామాల గిరిజనులు ఎటువంటి నిత్యావసర సరుకులు కొనుగోలు చేయాలన్నా, వైద్య సేవలు పొందాలన్నా, పండించిన కూరగాయలను విక్రయించాలన్నా అరకు సంత బయలుతో పాటు అరకులోయ ప్రాంతానికి వచ్చి పనులు చేసుకుంటూ వెళుతుంటారు. ఆ ప్రాంత గిరిజనుల రవాణా సౌకర్యానికి గత్తర జిల్లెడ వంతెన ప్రధానంగా ఉంది. ఈ వంతెన నిర్మాణానికి సుమారు నాలుగేళ్ల క్రితం నిర్మాణ పనులను ప్రారంభించారు. రాడ్లతో పునాది దశ వరకు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. అప్పటినుంచి ఇప్పటికీ నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపైన వర్షం నీరు నిల్వ ఉండి పోతుండటంతో బురదగా మారుతోంది. దీంతో, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుం డడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో ఆ ప్రాంతం గిరిజనులు అనారోగ్యానికి గురైతే 108 అంబులెన్స్ వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఒడిస్సాకు కనెక్టివిటీగా ఈ రోడ్డు ఉండటంతో నిత్యం ఒడిస్సా నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు.

నిర్మాణం చేపట్టని వంతెన వద్ద బురదగా ఉన్న మార్గం

**ఇబ్బంది పడుతున్న పర్యాటకులు:**
కొల్లాపూట్టులో జల తరంగిని పర్యాటక ప్రదేశం ఉండడంతో పర్యాటకులు కూడా నిత్యం రాకపోకలు చేస్తుంటారు. అక్కడకు వెళ్లేందుకు కూడా ఈ వంతెన మీదుగా వెళ్లాల్సి ఉండటంతో పర్యాటకులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ ప్రదేశాన్ని తిలకించడానికి వెళ్లడానికి వచ్చిన కొంతమంది ఈ వంతెన వరకు వెళ్లి తిరుగు ముఖం పడుతున్నారు. పలుమార్లు సంబంధిత ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న ఈ వంతెన నిర్మాణ పనులను పూర్తి చేసి రవాణా కష్టాలు తీర్చాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

# విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి
## సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స

**ప్రజాశక్తి-పాడేరు:** విద్యుత్ రెగ్యులేటరీ కమీషన్ తుది నిర్ణయం ప్రకారం రు.923 కోట్లు మాత్రమే కాకుండా 2024-25 కాలానికి అక్రమంగా వసూలు చేసిన మొత్తం ట్రూ అప్ ఛార్జీలు రూ.2758 కోట్లు వినియోగదారులకు వాపసు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి. అప్పలనరస డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ,2024-25 కాలానికి సంబంధించి 923 కోట్ల రూ. ట్రూ డౌన్ ద్వారా, ఇప్పుడు వినియోగించుకుంటున్న విద్యుత్ పై యూనిట్ కు 13 పైసల చొప్పున సంవత్సర కాలంలో తిరిగి వినియోగదారులకు చెల్లించాలని నియంత్రణ మండలి ఆదేశాలు ఇవ్వడం సరైనదేనన్నారు. ప్రతి నెలా వినియోగించుకున్న యూనిట్ పై తదుపరి నెల బిల్లులలో 40పైసల చొప్పున ముందుగానే 2758 కోట్ల రూ. వినియోగదారుల వద్ద నుండి అక్రమంగా ఇంధన సర్దుబాటు చార్జీలు (ఎఫ్.పి.వై.సి.ఎ) పేరుతో వసూలు చేశారని పేర్కొన్నారు. ఇది అన్యాయంగా వసూలు చేసినట్లు స్పష్టమవుతుందున దీన్ని కూడా వినియోగదారులకు వాపసు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు వసూలు చేస్తున్న 40 పైసల్ని వెంటనే ఆపేయాలని అన్నారు. విద్యుత్ అదనపు భారాలు మోపబోమని కూటమి నేతలు ఎన్నికలలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ బాదుడు ఉండదని పదే పదే ప్రకటించారన్నారు. కూటమి ప్రభుత్వం మాట తప్పి 15 నెలల కాలంలోనే 2022-23, 23-24 సంవత్సరాలు సంబంధించి 15,485 కోట్ల రూ. సర్దుబాటు చార్జీల పేరుతో భారం మోపిందన్నారు. ఇదే కాకుండా ప్రతినెలా 40 పైసల చొప్పున అదనంగా సర్దుబాటు చార్జీలు వసూలు చేస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీకు అనుగుణంగా ఇప్పటికే వసూలు చేసిన 2758 కోట్లతో పాటు ఇప్పటికీ వసూలు చేస్తున్న 15,485కోట్ల రూ.భారాన్ని నిలిపి వేయాలన్నారు. అదనంగా మోపిన మొత్తం భారాలను తగ్గించి కూటమి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఈ సర్దుబాటు చార్జీల విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలన్నారు.

# కంటి మీద కునుకు కరువు

- భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43.10 అడుగులు
- మొదటి ప్రమాద హెచ్చరిక దాటిన వరద
- ముంపు గ్రామాల ప్రజల్లో ఆందోళన

భద్రాచలం - కూనవరం రహదారిపై చేరిన వరదనీరు

**ప్రజాశక్తి-విఆర్‌పురం:** ఎగువన కురిసిన వర్షాలకు మండలంలోని 50 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శనివారం రాత్రి 10 గంటలకు తగ్గుతూ వస్తున్న గోదావరి ఆదివారం ఉదయం 42.20గా ఉంది. సాయంత్రం భద్రాచలం వద్ద 43.10 చేరడంతో మొదటి హెచ్చరిక జారీ చేశారు. గోదావరి, శబరి హెచ్చుతగ్గులతో వస్తున్న వరదను చూసి రైతులు ముంపు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా ముంపు బాధితులు మాట్లాడుతూ గ్రామాల చుట్టూ వరద చేరడంతో ఎటూ వెళ్లలేని పరిస్థితిలో ఉన్నామని అత్యవసరమైతే పడవలపై ప్రయాణం చేయాల్సి వస్తోందని ఇప్పటికీ రెండు రోజులు అవుతున్నా ఏ అధికారీ కూడా వచ్చి చూడలేదని రెండు నెలలుగా గోదావరి వరద పెరుగుతుండడం, తగ్గుతుండ డంతో అటు నిర్వాసిత కాలనీల్లో ఉండలేక రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నామని వ్యవసాయం చేసుకునే పరిస్థితి కూడా లేదని ఓ పక్క వరదలు, మరోపక్క పనులు లేక ఇబ్బందులకు గురవుతున్నా మని తక్షణం ప్రభుత్వం ఆర్థికసాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
**ఎటపాక :** గోదావరి వరద ముంపు ప్రాంతాలను ఇప్పట్లో వదిలేలా లేదు. భద్రాచలం వద్ద శనివారం 46.70 ఉన్న వరద ఆదివారం ఉదయం 42 అడుగులకు చేరుకుని సాయంత్రానికి కాస్త పెరిగి 43.4 అడుగులు వద్ద ప్రవహిస్తోంది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. మెల్లగా తగ్గుతూ మరొక రోజు పెరుగుతూ గోదావరి వరద ముంపు ప్రాంత రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. వరద పెరగడంతో భద్రాచలం కూనవరం రహదారి పైకి మురుమూరు వద్ద మళ్లీ వరద నీరు చేరుకుంది.

రామవరం వెంకన్నగూడెం వద్ద నీటిలో ప్రయాణం చేస్తున్న గ్రామస్తులు

# ప్రమాదకరంగా డొంకరాయి జలాశయం

**ప్రజాశక్తి -సీలేరు:** అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరు కాంప్లెక్స్ పరిధి దిగువ సీలేరు డొంకరాయి పరిసర ప్రాంతాల్లో మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురిసాయి. ఈ నేపథ్యం లో డొంకరాయి జలాశయము నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరింది. ఎపి జెన్‌కో ఎఇ శివశంకర్ మాట్లాడుతూ శనివారం రాత్రి జలాశయం 7వ నంబర్ గేటు ద్వారా 3వేల క్యూసెక్కులు నీటిని దిగువ ప్రాంతానికి విడుదల చేసామన్నారు. జలాశయము పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1035.60 నీటినిల్వలు చేరుకున్నాయని తెలిపారు. ఆదివారం జలాశయంలో ఇన్ఫ్లో్స్ 9 వేలు క్యూసెక్కులు చేరుతుండడంతో 6 వ నెంబరు గేట్ నుంచి మరొక 2 వేలు క్యూసెక్కుల నీటిని అదనంగా దిగువ ప్రాంతానికి విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. దీంతో మొత్తం రెండు గేట్లు ద్వారా 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు వెల్లడించారు. జలాశయం నీటిమట్టం సాధారణ స్థాయికి వచ్చేవరకు నీటి విడుదల కొనసాగించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం డొంకరాయి పవర్ కెనాల్ ద్వారా 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని ఎఇ పేర్కొన్నారు.

డొంకరాయి జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

# క'న్నీరే' మిగిలింది

- వరదలతో నీట మునిగిన వరి, మిర్చి పైర్లు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు

రైతులు సాగు చేసిన మిరప పంట

నీట మునిగిన వరి పంట

**ప్రజాశక్తి-విఆర్‌పురం:** తూర్పు ఏజెన్సీలోని ముంపు మండలాల్లో వరద విపత్తు వరుస వరదలతో ఏజెన్సీ రైతాంగం ఎన్నో కష్టనష్టాలను చవిచూస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ వరద తగ్గిందని భావించి మిర్చి నాట్లు కూడా వేశారు. వరి కూడా బాగుంది అనుకునే సమయంలో మరోసారి వచ్చిన వరద రైతన్నల నడ్డి విరిచింది. మళ్లీ వరద రావడంతో పంటలన్నీ నీట మునిగాయి. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి వరి, మిర్చి సాగు చేసిన అన్నదాతకు అనేక అవస్థలు వెంటాడుతున్నాయి.
ఇంకా కొన్నిచోట్ల నాట్లు వేసే పనిలో ఉండగా చాలావరకూ ముంపునకు గురయ్యాయి. ఒక్క ఎకరాకు 10 నుండి 20 వేల వరకూ వరి నాట్లు వేసేందుకు ఖర్చు అయిందని ఇప్పుడు మొత్తం మునిగిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కన్నయ్యగూడెం, చింతరేగుపల్లి, చొక్కనపల్లి, శ్రీరామగిరి ధర్మతాళ్లగూడెం, రామవరం, చొపల్లి తదితర గ్రామాల్లో పూర్తిగా వరి నాట్లు వేశారు. కొన్ని గ్రామాల్లో మిర్చి కూడా వేశారు. వరస గోదావరి వరద విపత్తులతో నీట మునిగిన వరి, మిర్చి రైతులను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. సుమారుగా 400 ఎకరాలకు పైగా వరి నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు సర్వేచేసి నష్టపరిహారాన్ని అందించాలని రైతులు కోరుతున్నారు.

మిరప నారు మడుల్లోకి చేరిన నీరు

ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న ఎఫ్‌డిసి అధికారులు

## ఎఫ్‌డిసికి ఎక్సలెన్స్ అవార్డులు

**ప్రజాశక్తి పాడేరు, :** అల్లూరి జిల్లాలో కాఫీ తోటల పెంపకాన్ని నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ (ఏపిఎఫ్‌డిసి) కు రాష్ట్ర పర్యాటక శాఖ ద్వారా 3 ప్రతిష్టాత్మకమైన టూరిజం ఎక్సలెన్స్ అవార్డులు లభించాయి. శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భంగా విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఈ టూరిజం ఎక్సలెన్స్ అవార్డు విజేతలను ప్రకటించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ అటవీ అభివద్ధి సంస్థ మూడు విభాగాలలో అవార్డులను గెలుచుకుంది, వీటిలో సుంకరమెట్టలో ఏపీఎఫ్‌డీసీ నిర్మించిన బెస్ట్ యునిక్ టూరిజం ప్రాజెక్ట్ కెనోపీ వాక్ ఆన్ వుడెన్ బ్రిడ్జి, కాఫీ ట్రైల్‌కు, అరకువ్యాలీ లోని బెస్ట్ లొకేషన్ ఫర్ ఫిలిమ్ షూటింగ్ కాఫీ ఎస్టేట్స్‌కు అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదగా ఏపిఎఫ్‌డిసి అధికారులు ఈ అవార్డులను అందుకున్నారు.

## యువత ఉపాధికి ఉద్యమిద్దాం : డివైఎఫ్ఐ

**ప్రజాశక్తి -ములగాడ :** ఉపాధి కోసం ఉద్యమిద్దామని డివైఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ విశాఖ జిల్లా 16వ మహాసభల సందర్భంగా మల్కాపురంలో 60వ వార్డు పరిధి కోరమండల్ గేట్ నుండి మల్కాపురం వరకు ర్యాలీ నిర్వహించారు. మల్కాపురం సిఐటియు కార్యాలయం వద్ద వతాకాన్ని డివైఎఫ్ఐ మల్కాపురం జోన్ పూర్వ కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ ఎగురవేశారు. ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా ఎస్.వాసుశ్రావణ్‌కుమార్, శైలజ వ్యవహరించారు. భారత స్వాతంత్ర పోరాట యోధులు భగత్ సింగ్. మన్య వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి పూలమాలలువేసి నివాళులర్పించారు. గత మూడేళ్ల నివేదికను కార్యదర్శి సంతోష్ ప్రవేశపెట్టారు. నివేదికను సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర డివైఎఫ్ఐ కార్యదర్శి జి.రామన్న హాజరై మాట్లాడుతూ, యువతకు ఉపాధి కోసం జాబ్ క్యాలెండర్ ఇవ్వాలన్నారు. రానున్న కాలంలో నిరుద్యోగంపై డివైఎఫ్ఐ పనిచేస్తుందని చెప్పారు. యువత ఉపాధిని దెబ్బతీయటానికి 13 గంటల పని విధానం తెస్తున్నారా అని ప్రశ్నించారు. భగత్ సింగ్ స్ఫూర్తితో డివైఎఫ్ఐ యువత కోసం, వారి హక్కుల కోసం పనిచేస్తుందని చెప్పారు. పరిశ్రమలలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

డివైఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షులు యుఎస్ఎన్.రాజు మాట్లాడుతూ, మతోన్మాద చర్యలను ఆర్ఎస్ఎస్ విడనాడాలని కోరారు. బిజెపి ప్రభుత్వం కోట్ల ఉద్యోగాలు ఎన్నికల హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాలనీలలో సమస్యలపైనా డివైఎఫ్ఐ పని చేస్తుందని చెప్పారు.

అనంతరం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని, శ్రీహరిపురం గుల్లలపాలెం హాస్పిటల్ వంద పడకలుగా మార్చాలని, గోపాలపట్నం పంచ గ్రామాల భూసమస్యను పరిష్కరించాలని, జిల్లా గ్రంథాలయాన్ని యువతకు అందుబాటులో ఉంచి అభివృద్ధి చేయాలని, 13 గంటల పనిదినాలను ఉపసంహరించుకోవాలని జిల్లా నాయకులు బూడి శ్రీను తీర్మానాలు ప్రవేశపెట్టిగా ఎస్.వాసు బలపరిచారు. తీర్మానాలను మహాసభ ఆమోదించింది.

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాయుడు, జెవివి కార్యదర్శి పరుశురాం, ఐద్వా రాష్ట్ర నాయకులు ఆర్.విమల, సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి లక్ష్మణమూర్తి, ప్రజానాట్య మండలి విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.చంటి మహాసభలో పాల్గొని సందేశాన్ని ఇచ్చారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు.

**నూతన కమిటీ**

డివైఎఫ్ఐ విశాఖ జిల్లా అధ్యక్షులుగా యుఎస్ఎన్.రాజు, కార్యదర్శిగా కె.మహేష్, ఉపాధ్యక్షులుగా శ్రావణ్, ఎస్.వాసు, గణేష్, సహాయ కార్యదర్శులుగా బూడి శ్రీను, రవి, ప్రభు, రాము, శ్యామ్, అప్పలరాజు, కమిటీ సభ్యులుగా సమీన్, సుభాన్, శరత్‌ప్రసాద్, హరిత, పోతయ్య, అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# చుక్క నీరు వస్తే ఒట్టు!

- అలంకారప్రాయంగా కుళాయిలు
- అంతర్ల కొత్తవీధిలో తాగునీటి అవస్థలు

**ప్రజాశక్తి-చింతపల్లి:** ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించినా, ఆ పథకాలు కాగితం మీదకే పరిమితమవుతున్నాయి. జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ తాగునీటి సరఫరా అందిస్తామని హామీ ఇచ్చినా, వాస్తవానికి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ట్యాప్‌లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.
. అంతర్ల కొత్త వీధిలో ఏర్పాటు చేసిన ట్యాప్ నుంచి నెలల తరబడి ఒక్క చుక్క నీరు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో పాడై, చుట్టూ పచ్చిక పెరిగి నిరుపయోగంగా మారిపోయింది. కుళాయిల ఏర్పాటుతో తమ తాగునీటి కష్టాలు తీరిపోతాయని ఎంతగానో ఆశించామని, అయితే చుక్కనీరు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని స్థానిక మహిళలు కవడం సన్యాసమ్మ, కవడం నాగరత్నం, కవడం పద్మ, కవడం రాములమ్మ, సురుగం లక్ష్మమ్మ, కాంత కుమారి, కవడం కొత్తన్నదొర, కవడం రాంప్రసాద్, కవడం సోమరాజు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం వర్షాల సీజన్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే, మున్ముందు వేసవిలో వేసవిలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, కుళాయిల మరమ్మతు చేసి, తాగునీటి కష్టాలకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

అంతర్ల కొత్త వీధిలో నిరుపయోగంగా ఉన్న కుళాయి

# ప్రహరీ లేక.. పశువుల సంచారం

- ఆటలు ఆడుకునేందుకు విద్యార్థుల అవస్థలు
- ఇదీ గురుకుల బాలుర పాఠశాలలో దుస్థితి

పశువులు, మేకల మధ్యనే ఆటలాడుతున్న విద్యార్థులు

**ప్రజాశక్తి- అరకులోయ**

అరకులోయలోని ఆదిమ జాతి గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల (పిటిజి)లో క్రీడా మైదానంలో ప్రహరీ గోడ లేక పోవడంతో పశువులు మేకల మధ్య విద్యార్థులు ఆటలాడుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ క్రీడా మైదానంలో చుట్టు ప్రహరీ గోడ నిర్మించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా కార్యరూపం దాల్చలేదు. ఈ పాఠశాల చుట్టుపక్కల గ్రామాల్లోని పశువులు, మేకలు ప్రతిరోజు ఈ మైదానంలోకి వస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయం భయంగా ఇదే గ్రౌండ్లో ఆటలాడుకుంటున్నారు. పశువులు, మేకలతో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రహరి గోడ లేకపోవడంతో రక్షణ కరువైందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి పిటిజి గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో ప్రహరీ గోడ నిర్మించాలనివిద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# అంబులెన్స్ లేక అవస్థలు

- ఆసుపత్రుల్లోనే రోగుల పడిగాపులు

**ప్రజాశక్తి- పెదబయలు :** మండలంలోని గోమంగి పిహెచ్‌సిలోని అంబులెన్స్ మరమ్మతులకు గురికావడం, 108 వాహనానికి సమాచారమిస్తే గంటల తరబడి వచ్చే పరిస్థితి లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడే పరిస్థితులు నెల కొన్నాయి. తాజాగా శనివారం సాయంత్రం గోమంగి మినీ గురుకులంలో పనిచేస్తున్న టీచర్ అకస్మాత్తుగా జారిపడడంతో కాలు విరిగింది. గోమంగి ఆస్పత్రిలో ఉన్న అంబులెన్స్ మరమ్మతులకు గురికావడంతో పాడేరు ఆసుపత్రికి రిఫర్ చేయడంతో 108 అంబులెన్స్‌కు ఆరు గంటలకు సమాచారమిచ్చారు. రాత్రి 10 గంటలకు అది రాని పరిస్థితుల్లో నొప్పితో అవస్థలు పడుతూ, రోగి గోమంగిలోనే అవస్థలు పడాల్సి వచ్చిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గోమంగి నుంచి పెదబయలు, పాడేరు, ముంచంగిపుట్, ఎటువైపు వెళ్లాలన్నా 50 నుండి 70 కిలోమీటర్ల దూరం ఉండడం, అందుబాటులో ఎటువంటి వాహనాలు లేకపోవడంతో ఆస్పత్రుల్లోనే రోగులు పడిగాపులు పడాల్సిన దుస్థితి ఉందనిగోమంగి మండల సాధన సమితి నాయకులు ఆవేదన చెందుతున్నారు పాడైన ఆసుపత్రి అంబులెన్స్‌ను బాగుచేసి వినియోగంలోకి తేవడంతోపాటు అత్యవసర సమయాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని స్థానికులు, గోమంగి మండల సాధన సమితి నాయకులు కొమ్మ అనంత పద్మనాభం, కె. బాలరాజు, కె.మహేష్, జి ధనుంజయ్, సిహెచ్ రవి డిమాండ్ చేశారు.

## నేరాలు ఘోరాలు

మృతదేహాన్ని తరలిస్తున్న కుటుంబ సభ్యులు

## కలువ పూల సేకరణకు వెళ్లి...
## చెరువులో మునిగి యువకుడు మృతి

**ప్రజాశక్తి- డుంబ్రిగుడ:** కలువ పూలు సేకరణకు ఊలోనున్న చెరువులో దిగి గిరి యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు... అరమ పంచాయతీ డుంబ్రివలస గ్రామానికి చెందిన పాంగి సంజీవరావు (21) అనే గిరిజన యువకుడు గ్రామానికి సమీపంలోని నందివలస చెరువులో కలువ పూలు సేకరణకు దిగి ఊబిలో ఇరుక్కుపోయి ఊపిరాడక మృతి చెందాడు.

ఎంతకీ ఇంటికి రాక పోవడంతో బాధిత కుటుంబీకులు, గ్రామస్థులు పరిసరా ప్రాంతంలో గాలింపుకు చేయగా చెరువు బయట మృతుడి దుస్తులు ఉన్నాయి. దీన్ని గమనించిన బాధిత కుటుంబీకులు, గ్రామస్థులు యువకులతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. మృతుడు చెరువులోని ఊబిలో చిక్కుకుని మృతి చెందడంతో బయటకు తీశారు. చేతికందొచ్చిన కుమారుడు మృతితో బాధిత కుటుంబీకులు జీర్ణించు కోలేకపోతున్నారు. యువకుడి మృతితో డుంబ్రివలస, పరిసర ప్రాంత గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## గంజాయి కేసులో ముగ్గురు అరెస్ట్

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి సేకరించి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్న ముగ్గురిని ఆదివారం మహారాణి పేట పోలీసులు అరెస్ట్ చేశారు. సిఐ జి.దివాకర్ యాదవ్ కథనం మేరకు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలోని గోమంగి గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ అలియాస్ ప్రభ ఆ ప్రాంతంలోని గంజాయి సేకరించి లోచలి కుమారస్వామి, గోమంగి నాని బాబుకు ఎప్పటిలాగే ఇచ్చాడు. వారు ఇతర ప్రాంతాలకు గంజాయిని తరలించసాగారు. ప్రభ గంజాయి అక్రమ రవాణాలో ఆరితేరిన నేరస్తుడు. విశాఖ టూ టౌన్, పెందుర్తి, శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస స్టేషన్లలో అతనిపై కేసులు ఉన్నాయి. అరెస్టయి, బెయిల్‌పై విడుదలై మళ్లీ అవే తరహా నేరాలు చేస్తున్నాడు. తాజా కేసులో ముద్దాయిలుగా ఉన్న కుమారస్వామి, నాని బాబులపై కూడా గంజాయి కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ ముగ్గురిని చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేసిన సిఐ దివాకర్ యాదవ్, హెడ్ కానిస్టేబుళ్లు సురేష్, నాగేంద్ర, నందకిషోర్‌లను ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భవానీ భక్తులు మృతి

**ప్రజాశక్తి -నక్కపల్లి:** నక్కపల్లి మండలంలో దోసల పాడు గ్రామంలో భవాని భక్తుల మృతితో విషాదఛాయలు అలుముకున్నాయి. కాలినడకన విజయవాడ వెళుతున్న భవానీ దీక్షాపరులపై కారు దూసుకెళ్లిన ఘటనలో ఇరువురు భవానీలు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. స్థానికుల కథనం మేరకు... మండలంలో దోసలపాడు గ్రామానికి చెందిన పక్కుర్తి శివ, పక్కుర్తి శ్రీను, పక్కుర్తి శేషులు తదితరులు దుర్గా భవాని దీక్ష చేపట్టి బుధవారం ఉదయం కాలినడకన విజయవాడ కొండకు బయలు దేరారు. పశ్చిమ గోదావరి జిల్లా నల్లజర్ల మండలం పుల్లలపాడు వద్దకు వెళ్లేసరికి ఆదివారం ఉదయం వారిపై కారు దూసుకు వెళ్లడంతో పక్కుర్తి శివ, పక్కుర్తి శ్రీను సంఘటన స్థలంలోనే మృతి చెందగా, పక్కుర్తి శేషులు తీవ్రంగా గాయపడ్డాడు. మృతుని కుటుంబ సభ్యులకు హోం మంత్రి అనిత తన సానుభూతిని తెలియజేశారు.

అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ ఇమ్మాన్యుయేల్ తదితరులు

## జిఎస్‌టి కొత్త పన్నులపై అవగాహన

**ప్రజాశక్తి - విఆర్‌పురం:** అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, చింతూరు ఐటిడిఎ పిఒ శుభంనొక్వాల్ ఆదేశాల మేరకు మండలంలో రేఖపల్లి, విఆర్‌పురం వివిధ గ్రామాల్లో దుకాణాలు వద్ద జిఎస్‌టి తగ్గింపు సోమవారం నుంచే మొదలైంది. కొత్త జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత మొత్తం 375 రకాల ఉత్పత్తుల ధరలు తగ్గాయి. డైరీ ఉత్పత్తులు,ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు భారీగా తగ్గాయి. ఇప్పటికే ఆ కంపెనీల ధరలు తగ్గింపు ప్రకటనలు కూడా చేశాయి. వాటితో పాటు ఆహార పదార్థాలు, శీతల పానీయాలు ధరల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. అయితే పాత, కొత్త స్టాకు వంటి అంశాల్లో కొంత గందరగోళం తలెత్తే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం జిఎస్‌టి తగ్గించిన సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి జిఎస్‌టి వివరాలు అమ్మకాదారులు, వినియోగదారులకు తెలిపి చైతన్యపరిచారు. ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం హెల్ప్‌లైన్ విభాగం ఏర్పాటు చేయడం జరిగింది. జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ (ఎన్‌సిహెచ్)లోని ఎన్‌గ్రామ్ పోర్టల్‌లో స్పెషల్ విభాగాన్ని ఏర్పాటు చేశారని ఎంపిడిఒ ఇమ్మానుయేల్ తెలిపారు. కూనవరం టేకులబోరు దుకాణదారుల వద్దకి వెళ్లి జిఎస్‌టిపై పాత, కొత్తరేట్లు పట్టిక ఏర్పాటు చేయాలని వారికి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దుకాణదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## 150 మందికి వైద్యపరీక్షలు

**ప్రజాశక్తి -రంపచోడవరం :** రామకృష్ణమిషన్ గిరిజన సంచార వైద్యశాల సిరిగిందలపాడు, (రంపచోడవరం) కాకినాడ రంగారాయ వైద్యకళాశాలలో బహుళ విభాగాల పరిశోధన కేంద్రం, కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి వారు సంయుక్తంగా స్వస్త్‌నారీస్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా స్థానిక సిరిగిందలపాడు (రంపచోడవరం)లో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. శిబిరంలో సుమారు 150 మంది మహిళలకు డాక్టర్ ఆర్.రాజ్యలక్ష్మి, క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. పలువురు వైద్యులు క్యాన్సర్ పరీక్షల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణాకర్, డాక్టర్ వినోద్ కుమార్ గణేశన్, డాక్టర్ టి.రాజేష్, రామకృష్ణ మిషన్ క్యాంప్ కో ఆర్డినేటర్, కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు పాల్గొన్నారు. అనంతరం రోగులకు అన్నదానం నిర్వహించినట్లు స్వామీజీ తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో పూజలు

**ప్రజాశక్తి -సీలేరు:** జికె వీధి మండలం సీలేరులో ఆదివారం షిర్డి సాయి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి ఆలయంలో భక్తులు నగర సంకీర్తనలు ఆలాపించారు. పంచామృతాలతో అభిషేకం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చిన్నారులు కేక్ కట్ చేశారు. చిన్నారులు పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.

## డెంగీ, మలేరియా నివారణపై అవగాహనా సదస్సు

**ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ:** భారతదేశాన్ని డెంగ్యూ రహితంగా మార్చాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఓడోమోస్ సంస్థ దోమల వికర్షక బ్రాండ్ అయిన డాబర్‌తో కలిసి విశాఖపట్నంలో 'ఇండియా డెంగ్యూ రహితం' అనే పేరుతో అవగాహన నిర్వహించింది. దోమకాటు నివారణపై మురికివాడల్లో అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టింది. కార్యక్రమంలో రోజరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుండి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డాబర్ ఇండియా లిమిటెడ్ హోమ్ కేర్ మార్కెటింగ్ హెడ్ వైభవ్ రతి మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతం చేసిన విద్యార్థులకు, పాఠశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రారంభమైన మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్

**ప్రజాశక్తి -విశాఖకలెక్టరేట్ :** రోటరీక్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. రోటరీక్లబ్ 3020 డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై.కళ్యాణ చక్రవర్తి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని క్లబ్ అధ్యక్షుడు చింతా నేతాజీ, సెక్రెటరీ పి.భాస్కర, నరేంద్రజగన్‌లతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ అంతర్జాతీయంగా రోటరీక్లబ్ చేస్తున్న సేవల ద్వారా కోట్లాదిమందికి మేలు జరిగిందన్నారు. పోలియో నివారణనిధి సేకరణలో భాగంగా రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ప్రత్యేకదృష్టి సారించి చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. క్లబ్ అధ్యక్షుడు చింతా నేతాజీ మాట్లాడుతూ రోటరీడిస్ట్రిక్ట్ 3020 పరిధిలోని ఇచ్ఛాపురం నుండి అమరావతి వరకూ 80 క్లబ్ నుండి క్రీడాకారులు ఉత్సాహం గా టోర్నమెంట్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. మహిళలు, పురుషులు డబుల్స్ విభాగాలుగా జరిగే ఈ టోర్నమెంట్లో 50 టీంల మధ్య పోటీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాస్ట్‌డిస్ట్రిక్ట్ గవర్నర్ సిహెచ్ కిషోర్‌కుమార్, పాస్ట్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ బచ్చు బ్రహ్మానందం, క్రీడా విభాగం చైర్మన్ సునీల్, కోఆర్డినేటర్ చక్రవర్తి, రోటరీ ప్రతినిధులు డాక్టర్ టి.ఎస్.రావు, డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ చైర్మన్ వరప్రసాద్,ఎండి యాసిన్ బాబా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టోర్నమెంట్ ప్రారంభిస్తున్న క్లబ్ అధ్యక్షుడు చింతా నేతాజీ తదితరులు

# నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా

**ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్**

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** గుర్రంజాషువా జయంతి సందర్భంగా, ఆదివారం బీచ్‌రోడ్‌లో ఉన్న గుర్రంజాషువా విగ్రహానికి దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవి కోకిలగా, నవయుగ కవితా చక్రవర్తిగా పేరుగాంచిన గుర్రం జాషువా తన రచనల ద్వారా సమాజంలో మార్పు తీసుకొచ్చిన గొప్ప యోధుడని తెలిపారు. 1964లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనను 'కళాప్రపూర్ణ' గౌరవ డాక్టరేట్‌తో సత్కరించడంతో పాటు, భారత ప్రభుత్వం 1970లో ఆయనకు పద్మభూషణ్‌ను ప్రదానం చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

## లియోరా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

**ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ :** లియోరా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఆల్‌ఇండియారేడియో సమీపంలోని జగన్నాథ ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా వివిధ ఆరోగ్య సమస్యలు నివారణ సంరక్షణ యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలలో అవగాహన కల్పించారు. శిబిరానికి ప్రముఖ కార్డియోథోరాసిక్ సర్జన్ డాక్టర్ సుజిత్‌కుమార్ మొహంతి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సంయుక్త పాల్గొన్నారు. ట్రస్టీ సభ్యులు హసికేశ్ బిసోయి, మధుస్మిత మొహంతి, త్రిప్తిమయి ఖుంటియా హాజరయ్యారు.

ప్రసాద్‌ను సన్మానిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

## డాక్టర్ జికెడి ప్రసాద్‌కు జాషువా పురస్కారం

**ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ:**

ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్న డాక్టర్ జికెడి ప్రసాదరావుకి ఈ ఏడాది గుర్రం జాషువా రాష్ట్ర పురస్కారం లభించింది. విజయవాడ ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పింగళి వెంకయ్య సభావేదికలో రాష్ట్ర సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. పురస్కారంలో రూ.50,000 నగదు, ప్రశంసాపత్రం, శాలువా, పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక సృజనశాఖ కార్యనిర్వాహక సంచాలకులు ఆర్.మల్లికార్జునరావు, విజయవాడ కలెక్టర్ ఎస్పీ షా, తదితరులు పాల్గొన్నారు.

## మహారాణిపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సిపి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** మహారాణిపేట పోలీసుస్టేషన్ (లా అండ్ ఆర్డర్)ను నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్‌స్టేషన్ మొత్తం పరిశీలించి, కేసుల ఫైళ్లను నిశితంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు పరిశీలించి ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా, శుభ్రం చేయించి,మొక్కలు నాటాలని ఆదేశించారు.

## పారిశ్రామిక ప్రగతిపై చంద్రబాబువి పచ్చి అబద్ధాలు

**- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్**

**ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ :** కూటమి ప్రభుత్వ పాలనలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతోందని సిగ్గులేకుండా సిఎం చంద్రబాబు అసెంబ్లీ వేదికగా పచ్చి అబద్ధాలు మాట్లాడారని వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. ఆదివారం విశాఖ వైసిపి నగర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గత పదహారు నెలలుగా రాష్ట్రంలోని పారిశ్రామిక రంగం చీకటి రోజులను చూస్తోందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో జరుపుతున్న అరాచక పాలన చూసి ఎపి వైపు ఒక్క పారిశ్రామికవేత్త కూడా వచ్చేందుకు సిద్ధంగా లేరన్నారు. గతంలో పలువురు పారిశ్రామికవేత్తలతో మాజీ సిఎం జగన్ చేసుకున్న ఒప్పందాలను, తీసుకువచ్చిన పరిశ్రమలను తమ ఘనతగా చెప్పుకోవడానికి చంద్రబాబుకు సిగ్గులేదా అని ప్రశ్నించారు.

## అన్ని వయస్సుల వారిలో గుండె సమస్యలు

**ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్, ఎంవిపికాలని:** అంతర్జాతీయ హృదయ దినోత్సవం సందర్భంగా, కిమ్స్ హాస్పిటల్స్, సీతమ్మధార శాఖ ఆధ్వర్యంలో గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు వాక్‌థాన్ అవగాహన కార్యక్రమంను ఆదివారం ఆర్‌కెబీచ్‌లో నిర్వహించారు. వాక్‌థాన్‌లో హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.బి.విజయ్‌కుమార్, సిఇఒ డాక్టర్ శ్రీధర్, కార్డియాలజీ విభాగానికి డాక్టర్ గణేష్ కాశీనాథుని, డాక్టర్ గరికపాటి మహేష్, డాక్టర్ సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్డియాలజీ చీఫ్‌కన్సల్టెంట్ డాక్టర్‌గణేష్ కాశీనాథుని మాట్లాడుతూ, గత కొంతకాలంగా వయస్సుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా యువత తమ ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని సంవత్సరాలుగా అన్ని వయస్సుల వారిలో గుండె సమస్యలు పెరుగుతున్నాయని, దీనికి జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడి ప్రధాన కారణాలుగా ఉన్నాయన్నారు. మితిమీరిన వ్యాయామం కూడా ప్రమాదకరమే అని హెచ్చరించారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది, నర్సింగ్ టీంలు పాల్గొన్నారు.

కార్యక్రమం ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

## ఘనంగా వరల్డ్ హార్ట్ డే వేడుకలు

**ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్:** నగరంలోని ఆర్‌కెబీచ్‌లో ఆదివారం ఎంజిఎం సెవెన్‌హిల్స్ హాస్పిటల్ హోస్ట్స్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా వాక్‌థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'డోంట్ మిస్ ఎ బీట్' అనే నినాదంతో చేపట్టిన కార్యక్రమాన్ని, కాళీమాత ఆలయం నుండి వైఎంసిఎ వరకూ చేపట్టారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ గుండెజబ్బులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు చేయించుకో వాలని సూచించారు. డాక్టర్ కె.దామోదరరావు, డాక్టర్ ఎం.భాస్కరరావు, డాక్టర్ ఎం.ఎన్.రాజు, డాక్టర్ శిరీష, డాక్టర్‌ఎల్.హరితకుమారి, తదితరులు పాల్గొన్నారు. ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ గిరిబాబు నాదెళ్ల, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాఘవేంద్ర కుమార్ గుడ్ల, ఆసుపత్రి నర్సులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.